

హరిత దీపావళి.. ఆనందాల కేళి

దీపావళి రోజున టపాసులు కాల్చడానికి బదులు మొక్కలు నాటి సంరక్షించాలి. దీనివల్ల శబ్ద, వాయు కాలుష్యం తగ్గిపోయి పర్యావరణాన్ని పరిరక్షించవచ్చు. -8లో



ట్యాంకు పైకెక్కి వ్యక్తి హల్‌చల్

బి.కొత్తకోటలో ఓ వ్యక్తి కుటుంబ కలహాలతో పూటుగా మద్యం తాగి నీటి ట్యాంకుపైకి ఎక్కి ఆత్మహత్య చేసుకుంటానంటూ హల్‌చల్ చేశారు. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.360	రూ.420
రెండోరకం	రూ.290	రూ.356

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 344 మెట్రిక్ టన్నులు



బాధలు వింటూ.. భరోసా ఇస్తూ..

- కార్యకర్తలు, నాయకుల కష్టసుఖాలు తెలుసుకున్న మాజీ సీఎం వైఎస్ జగన్
- ఏకపక్ష విధానాలు వీడండి.. పోలీసులకు హితబోధ
- ప్రభుత్వ అరాచకాలపై ప్రజలు తిరగబడాలి



ఇడుపులపాయలో వైఎస్ విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న మాజీ సీఎం వైఎస్ జగన్



వేంపల్లిలో అభిమానులకు అభివాదం తెలుపుతున్న మాజీ ముఖ్యమంత్రి, వైఎస్ఆర్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

సాక్షి, కడప: ప్రజల బాధలు, కష్టాలు, సమస్యలు వింటూ.. నేనున్నాను.. అంటూ వారికి భరోసాతో పాటు ధైర్యాన్ని ఇచ్చారు మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి. మంగళవారం బెంగళూరు నుంచి పులివెందుల చేరుకున్న ఆయన పలు కార్యక్రమాలలో పాల్గొన్నారు. ఉదయం 11 గంటల ప్రాంతంలో ఇడుపులపాయలోని తండ్రి, దివంగత సీఎం డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ఘాట్‌కు చేరుకుని ఘనంగా నివాళులర్పించారు. ముందుగా సమాధిపై పుష్పగుచ్ఛాలు ఉంచి మోకరిల్లి నాన్నను స్మరించుకున్నారు. సోదరుడు, కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డితో కలిసి ఘాట్ వద్ద నివాళులర్పించిన అనంతరం అక్కడే వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

పోలీసుల ఏకపక్ష చర్యలు మంచిది కాదు..

వైఎస్సార్‌సీపీ అధికారంలో ఉన్నప్పుడు ఎవరిపైనా కక్షపూరిత రాజకీయాలు చేయలేదని.. ఇప్పుడు పార్టీ శ్రేణులపై అధికార పక్షం దాడులు చేస్తున్నా పోలీసులు ఏకపక్ష వైఖరి అవలంబించడం కరెక్టు కాదని వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అన్నారు. చట్టాన్ని రక్షించాల్సిన పోలీసులే అధికార పక్షానికి జై కొడితే ఎలా అని ప్రశ్నించారు. ఇటీవల సింహాద్రిపురం మండలం నంద్యాలంపల్లె వైఎస్సార్‌సీపీ నాయకుడు మహేశ్వరరెడ్డిపై టీడీపీ నేతలు దారి కాచి హత్యాయత్నానికి పాల్పడ్డారు. ఈ విషయాన్ని ఫిర్యాదు చేసినా పోలీసులు కేసు నీరుగార్చారని వారి కుటుంబ సభ్యులు మాజీ సీఎం వైఎస్ జగన్ దృష్టికి తీసుకెళ్లారు. అక్కడే ఉన్న సీఐ వెంకటరమణను పిలిపించి చట్టాన్ని కాపాడటంలో అలసత్వం ప్రదర్శించవద్దని హెచ్చరించారు. చట్టానికి ఎవ్వరూ అతీతులు కాదని తెలియజెప్పాల్సిన బాధ్యత మీ వ్యవస్థపై ఉందని సూచించారు. రాజకీయ ప్రేరేపిత ఘటనలను అరికట్టడంలో వివక్ష ప్రదర్శించడం ఎంతమాత్రం మంచిది కాదని మాజీ సీఎం వైఎస్ జగన్ హెచ్చరించారు.

పార్టీ శ్రేణులు ధైర్యంగా ఎదుర్కోవాలి..

కూటమి సర్కార్ అధికారంలోకి వచ్చిన తర్వాత వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులపై దాడులు జరుగుతున్నాయని.. ఇది ఏమాత్రం మంచి పద్ధతి కాదని.. పద్ధతి మార్చుకోవాలని మాజీ సీఎం వైఎస్ జగన్ హెచ్చరించారు. టీడీపీ అరాచకాలను పార్టీ శ్రేణులు ధైర్యంగా ఎదుర్కోవాలని ఆయన సూచించారు. కష్టాలు ఎల్లకాలం ఉండవని.. ప్రతి ఒక్కరూ పోరాట పంథాను ఎంచుకుని ముందుకు సాగాలని పార్టీ శ్రేణులకు ఆయన పిలుపునిచ్చారు. ఇటీవల హింసాత్మక రాజకీయాలకు పాల్పడుతున్న కూటమి నేతల తీరుపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారం ఎప్పుడూ శాశ్వతం కాదని.. ప్రజలకు సంక్షేమం అందించకుండా సంక్షామం సృష్టిస్తున్నారని ఆయన మండిపడ్డారు.

వేంపల్లెలో కాసేపు :

ఇడుపులపాయలో కార్యక్రమం అనంతరం మాజీ సీఎం వైఎస్ జగన్ నేరుగా వేంపల్లెకు చేరుకున్నారు. ఇటీవల వైఎస్సార్‌సీపీ నాయకుడు రుద్రా భాస్కర రెడ్డి కుమారుడు భరతసింహారెడ్డి వివాహం సుశాంతికతో జరిగింది. నూతన జంటను ఆయన ఆశీర్వదించారు. కుటుంబ సభ్యులతో ప్రత్యేకంగా ఫొటోలు దిగారు. అనంతరం వారి యోగక్షేమాలు తెలుసుకున్నారు. అనంతరం వేంపల్లెలో మాజీ జెడ్పీటీసీ షబ్బీర్ నూతన గృహ ప్రవేశానికి అప్పట్లో రాలేకపోయిన మాజీ సీఎం వైఎస్ జగన్ మంగళవారం ఆయన ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులతో కాసేపు మాట్లాడారు. వేంపల్లె, ఇడుపులపాయతోపాటు వేములలో మాజీ సీఎం వైఎస్ జగన్‌ను కలిసేందుకు భారీ సంఖ్యలో ప్రజలు తరలివచ్చారు.

పులివెందులలో నాయకులతో మమేకం..

పులివెందులకు చేరుకున్న మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పార్టీ నాయకులతో మమేకమయ్యారు. ప్రధానంగా కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డితోపాటు కడప జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు పి.రవీంద్రనాథరెడ్డి, అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు, రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధ, ఎమ్మెల్సీలు పి.రామసుబ్బారెడ్డి, గంగుల ప్రభాకర్‌రెడ్డి, రమేష్ యాదవ్, రామచంద్రారెడ్డి, కడప మేయర్ సురేష్ బాబు, మాజీ డిప్యూటీ సీఎం అంజాద్ బాషా, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు గడికోట శ్రీకాంత్‌రెడ్డి, శెట్టిపల్లె రఘురామిరెడ్డి, కొరముట్ల శ్రీనివాసులు, డాక్టర్ సుధీర్‌రెడ్డిలతోపాటు మాజీ డైరెక్టర్లు, పలువురు నాయకులతో చర్చించారు.

కిక్కిరిసిన క్యాంపు కార్యాలయం

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ రాక సందర్భంగా ఇడుపులపాయతో పాటు పులివెందులలోని భాకరాపురంలో ఉన్న క్యాంపు కార్యాలయం ప్రజలు, పార్టీ శ్రేణులు, అభిమానులతో కిక్కిరిసిపోయింది. అంతకుముందు పులివెందులలో దారిపొడవునా తన కోసం ఎదురు చూస్తున్న కార్యకర్తలు, అభిమానులు, ప్రజలకు అభి వాదం చేస్తూ, ఆగి పలకరిస్తూ, వారి వినతులు స్వీకరిస్తూ జగన్ తన క్యాంప్ కార్యాలయానికి చేరుకున్నారు. మాజీ సీఎం వైఎస్ జగన్‌ను చూడగానే ప్రజలు , అభిమానులు, కార్యకర్తలు.. ముఖ్యంగా యువత.. సీఎం.. సీఎం.. అంటూ నినాదాలతో హోరెత్తించారు. క్యాంపు కార్యాలయంలో మాజీ సీఎం వైఎస్ జగన్ ప్రజలు, కార్యకర్తలు, నాయకులు, ఇతర పార్టీ శ్రేణులతో మమేకమయ్యారు. ప్రజలకు సంబంధించి కష్టసుఖాలను అడిగి తెలుసుకోవడంతోపాటు పరిష్కారానికి చొరవ చూపారు. కొందరిని పేరు పేరునా ఆప్యాయంగా పలకరించడంతోపాటు ఇబ్బందులు పడిన వారిని ఆదుకుంటామన్నారు.



వేంపల్లిలో నూతన దంపతులు భరతసింహారెడ్డి, సుశాంతికలను ఆశీర్వదిస్తున్న వైఎస్ జగన్



వేంపల్లిలో మాజీ జెడ్పీటీసీ షబ్బీర్ నూతన గృహంలో శుభాకాంక్షలు తెలియజేస్తున్న వైఎస్ జగన్..



పులివెందులలోని క్యాంపు కార్యాలయంలో ప్రజల సమస్యలు ఆలకిస్తున్న మాజీ సీఎం వైఎస్ జగన్



ఇడుపులపాయ హెలీప్యాడ్ వద్ద వైఎస్ జగన్‌ను కలిసిన ఎంపీ అవినాష్ రెడ్డి, ఎమ్మెల్యే ఆకేపాటి, ఎమ్మెల్సీలు రామచంద్రారెడ్డి, రామసుబ్బారెడ్డి, మాజీ ఎమ్మెల్యే రాచమల్లు, అంజద్‌బాషా తదితరులు



ఎమ్మెల్సీ గంగుల



ఎమ్మెల్సీ రమేష్‌యాదవ్



మాజీ ఎమ్మెల్యే గడికోట

న్యూస్‌రీల్

వన విహారి త్వరితగతిన పూర్తి

ఒంటిమిట్ట : మండలంలోని కుడుములూరు శ్రీరామ ఎత్తిపోతల పంప్‌హౌస్ వద్ద నిర్మిస్తున్న వన విహారి నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయాలని కడప జిల్లా డీఎఫ్‌ఓ వినీత్ కుమార్ సూచించారు. మంగళవారం వన విహారి నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. అనంతరం గుత్తేదారులు, స్థానిక అధికారులకు సలహాలు, సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌ఆర్‌ఓ ప్రణీతబాయ్, సిబ్బంది పాల్గొన్నారు.

బహుమతుల ప్రదానం

రాయచోటి టౌన్: రాయచోటి ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో మంగళవారం నిర్వహించిన అండర్ -17 కబడ్డీ క్రీడా పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు రాష్ట్ర రవాణా, యువజన క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి బహుమతులతోపాటు నగదు పురస్కారం అందజేశారు. మొదటి స్థానం సాధించిన జట్టుకు రూ.25 వేలు, రెండవ స్థానం రూ.15 వేలు, మూడవ, నాల్గవ స్థానాలలో నిలిచిన జట్లకు రూ.10 వేల చొప్పున అందజేశారు. అలాగే విజేత జట్టుకు తన సొంత నిధులతో రూ.1.2 లక్షలు అందజేశారు. కార్యక్రమంలో ఏపీ ఎస్‌జీఎఫ్ సెక్రటరీ భానుమూర్తి రాజు, డీఈవో సుబ్రహ్మణ్యం, అన్నమయ్య జిల్లా ఎస్జీఎఫ్ సెక్రటరీ వసంతకుమారి, ఆర్గనైజింగ్ సెక్రటరీ నాయుడు, డిప్యూటీ డీఈవో శివప్రకాష్‌రెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నూతన డయాలసిస్ సెంటర్ ప్రారంభం



నూతన డయాలసిస్ సెంటర్ ప్రారంభిస్తున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

రాయచోటి : రాయచోటి ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో నూతన డయాలసిస్ సెంటర్‌ను రాష్ట్ర రవాణా, యువజన, క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి మంగళవారం ప్రారంభించారు. ఈ ఆసుపత్రిలో గతంలో 60 మందికి మాత్రమే డయాలసిస్ చేసే సౌకర్యం ఉండేది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి దీన్ని 60 నుంచి 100 మందికి డయాలసిస్ చేసే సామర్థ్యం పెంచేందుకు కృషి చేశారు. విషయాన్ని అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి నిధులు మంజూరు చేయించారు. అంతేకాక 90 శాతం పనులు పూర్తి చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు డాక్టర్ లక్ష్మీప్రసాద్‌రెడ్డి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కొండయ్య, ఆసుపత్రి సూపరింటెండెంట్ డేవిడ్ సుకుమార్, డాక్టర్లు నర్సులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉన్నదెంత.. మిగిలినదెంత!

- హార్సిలీహిల్స్‌పై భూమి లెక్క తేల్చేందుకు చర్యలు
- డ్రోన్ సర్వే లెక్కల్లో తేడాతో మాన్యువల్‌గా రీ సర్వే
- వివిధ శాఖలకు 103 ఎకరాలు కేటాయింపు
- ఇక పక్కాగా తేలనున్న లెక్కలు



గవర్నర్ బంగ్లాను సర్వే చేస్తున్న సర్వేయర్లు



హార్సిలీహిల్స్ భూమి వివరాలు తెలిపే డ్రోన్ చిత్రం

బి.కొత్తకోట: రాష్ట్రంలో ఏకైక పర్వత నివాస ప్రాంతం హార్సిలీహిల్స్. ఈ చల్లటి కొండపై భూమి ఎంతుంది, ఎవరికెన్ని ఎకరాలు కేటాయించారు, ఇంకా ఎంత భూమి ఖాళీగా ఉంది. కొండపై నిర్మాణాలు, కేటాయించిన భూమి వినియోగం ఇలా అన్ని రకాల వివరాలు సేకరించేందుకు గతంలో డ్రోన్ ద్వారా రెవెన్యూ అధికారులు సర్వే నిర్వహించగా భూ లెక్కల్లో తేడాలు వచ్చాయి. దీంతో సమగ్ర సర్వే నిర్వహించాలని జిల్లా సర్వే శాఖ ఆదేశాలతో ఏడుగురు సర్వేయర్లు రంగంలోకి దిగారు. కొండపై రెండో రోజు మంగళవారం సర్వే కొనసాగింది. సముద్రమట్టానికి 1,256.53 మీటర్ల (4,141అడుగులు) ఎత్తులోని ఈ కొండ బి.కొత్తకోట మండలం కోటావూరు రెవెన్యూ గ్రామ పరిధిలో ఉంది. ఒకప్పుడు ఈ కొండ దట్టమైన అటవీప్రాంతం, చల్లటి ఆహ్లాదకరమైన వాతావరణంతో అలరారేది. బ్రిటీష్ పాలకులు కొండను వేసవి విడది కేంద్రంగా మార్చడంతో నివాసాలు ఏర్పడుతూ వచ్చాయి. రెవెన్యూ శాఖకు కొండపై సెంటు భూమిలేదు. మొత్తం అటవీ రిజర్వ్ ప్రాంతం కావడంతో.. అటవీశాఖ రెవెన్యూకు భూమి బదలాయించింది.

103 ఎకరాలు అటవీశాఖ ఇచ్చిందే

కొండపై రెవెన్యూశాఖకు భూమి లేకపోవడంతో 103 ఎకరాల భూమిని కేటాయించేందుకు అప్పటి మద్రాసు ప్రభుత్వం నిర్ణయించింది. ఈ భూమిని అటవీప్రాంతం నుంచి మినహాయించి రెవెన్యూశాఖకు కేటాయిస్తూ 1959 ఏప్రిల్ 15న నంబర్ 101523/సీ1/58-5 ద్వారా ఉత్తర్వు జారీ చేసింది. ఈ భూమిని సర్వే నంబర్ 538 బ్లాకు నుంచి వేరు చేస్తూ 1959 జూలై 25న రెవెన్యూ శాఖకు అధికారికంగా అప్పగించారు. తర్వాత కడప, చిత్తూరు ఉమ్మడి జిల్లాల కలెక్టర్ డబ్ల్యూహెచ్ హార్సిలీ అభ్యర్థనపై మద్రాసు ప్రభుత్వం అటవీప్రాంతంతో నిండిన కొండపై అతిథిగృహం నిర్మించుకోవడానికి 1869 మే 4న జీవోఎంఎస్ నంబర్ 11579 జారీ చేసింది. కొండపై ఇదే తొలి నిర్మాణం.

శాఖలకు కేటాయించుకుంటూ..

వివిధ శాఖలు కోరగానే గత ప్రభుత్వాలు భూములు కేటాయించుకుంటూ పోయాయి. కొండపై నెలకొన్న ప్రత్యేక పరిస్థితులు, భూమి విస్తీర్ణం, అందుబాటులోని వనరుల గురించి ఏమాత్రం ఆలోచించకుండా ఇచ్చుకొంటూ వెళ్లారు. 103 ఎకరాల భూమిలో సహకార గృహనిర్మాణ సంఘానికి 20.6 ఎకరాలు పోగా అత్యధికంగా పర్యాటక శాఖకు 24.38 ఎకరాలు ఇవ్వగా మరికొంత భూమిని వినియోగించుకుంటోంది. క్రీడా ప్రాంగణానికి 3.74 ఎకరాలు కేటాయించగా 9.20 ఎకరాలు రోడ్డుకు 56 అడగులలోతు వల్ల ఖాళీగా ఉంచారు. 33.03 ఎకరాలు కొండకు ఏటవాలుగా ఉన్నందున రోడ్డుకు వదిలారు (ఇందులోనూ కేటాయింపులు చేశారు). ఇవికాక పోలీసు, రైల్వే, మొబైల్ టవర్లు, బీఎస్ఎన్ఎల్, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్, సీడీసీఎంఎస్, పోస్టాఫీసు.. ఇలా శాఖలకు భూమిని కేటాయించారు. ఇక మిగిలింది చాలా తక్కువ భూమి కావడంతో దీనిపై కచ్చితమైన లెక్కలు తీయాలని చర్యలు చేపట్టారు.

టూరిజం ద్వారా ఒబెరాయ్‌కు

కొండపై ఒబెరాయ్ సంస్థకు 20.53 ఎకరాల భూమిని కేటాయించగా దాన్ని నేరుగా ప్రభుత్వం నుంచి అప్పగించకుండా టూరిజం శాఖ ద్వారా అప్పగించేలా చర్యలు జరుగుతున్నాయి. ఈ భూమిని రెవెన్యూ లెక్కల్లో టూరిజంకు మ్యూటేషన్ చేశాక ఒబెరాయ్‌కు అధికారికంగా అప్పగించాలని అధికారులు నిర్ణయించారు. దీనితో ఒబెరాయ్‌కు ఇచ్చే ముందు ఈ భూమి టూరిజంకు కేటాయించినట్టు.. ఈ శాఖ నుంచి ఒబెరాయ్‌కు అప్పగిస్తారు.

1972లో తొలి సర్వే

హార్సిలీహిల్స్‌పై ఉన్నది 103 ఎకరాల భూమిపై పలుమార్లు సర్వేలు జరిపారు. దశాబ్దకాలంలో నాలుగుసార్లు సర్వే జరిపింది రెవెన్యూ శాఖ. గత ఐదేళ్లలో రెండు సార్లు సర్వే చేసి నివేదికలు ఇచ్చారు. ఒకసారి డ్రోన్ సర్వే కూడా జరిగింది. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో పని చేసిన కలెక్టర్లు సర్వేలను ప్రత్యేకంగా జరిపించారు. ప్రస్తుతం ఎన్ని సర్వేలు జరిపినా మొదట సర్వే జరిగింది మాత్రం 1972లో. అప్పటి ప్రభుత్వం హైదరాబాద్ నుంచి ప్రత్యేకంగా సర్వే అధికారులు, సిబ్బందిని పంపించింది. అప్పట్లో ఈ సర్వే రెండు నెలలు జరిగింది. ఈ సర్వేతో సిద్ధం చేసిన రికార్డులే ఇప్పటి సర్వేయర్లకు ఆధారం. ప్రస్తుతం నిర్వహిస్తున్న సర్వే ఐదు రోజులు పాటు సాగనుంది. ఇప్పటికే రెండు రోజులు పూర్తికావడంతో మరో మూడు రోజులపాటు సర్వే నిర్వహించి పూర్తి నివేదికను సిద్ధం చే యనున్నారు.

నవంబర్‌లో నైపుణ్య గణన సర్వే ప్రారంభం



సర్వేపై వివరిస్తున్న జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి నాగార్జున, జిల్లా అధికారులు

రాయచోటి: అన్నమయ్య జిల్లాలో నైపుణ్య గణన (స్కిల్ సెన్సెస్)ను నవంబర్ మొదటి వారంలో ప్రారంభించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి దాసరి నాగార్జున తెలిపారు. కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్సు హాల్‌లో ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లాలోని సచివాలయం, నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఉపాధి కార్యాలయాల సిబ్బందికి నైపుణ్య గణన-2024 శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. హాజరైన సిబ్బందికి జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి నాగార్జున, జిల్లా జూనియర్ ఎంప్లాయిమెంట్ అధికారి దోణప్ప శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సర్వేలో 15 నుంచి 59 ఏళ్ల వయసు గల వారి నుంచి సమగ్ర డేటా సేకరించాల్సి ఉంటుందన్నారు. ఈ శిక్షణ ప్రాంతీయ పరిశ్రమలకు అనుగుణంగా ఉద్యోగ అవకాశాలు కల్పించడానికి ఉపయోగపడుతుందన్నారు. నైపుణ్య గణన ద్వారా జిల్లాలోని యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపరచడానికి వీలవతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా జీఎస్‌డబ్ల్యూఎస్ అధికారి లక్ష్మీపతి, డీఎల్‌డీఓ అమరనాథరెడ్డి, జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ, సిడాప్, నాక్, ఉపాధి కార్యాలయాల సిబ్బంది, మాస్టర్ ట్రైనర్ రవీంద్రనాథ్ పాల్గొన్నారు.

జిల్లాను అడ్వెంచర్ టూరిజం హబ్‌గా చేయాలి

జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్

రాయచోటి: అన్నమయ్య జిల్లాలో హార్సిలీహిల్స్, గుర్రంకొండ వంటి ప్రాంతాల్లో అడ్వెంచర్ పర్యాటకానికి మంచి అవకాశాలు ఉన్నాయని, వీటిని దృష్టిలో పెట్టుకుని జిల్లాను అడ్వెంచర్ టూరిజం హబ్‌గా అభివృద్ధి చేయాలని జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం రాయచోటి కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జిల్లా టూరిజం కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో పర్యాటక రంగానికి ఉన్న మంచి అవకాశాలు, సవాళ్ల గురించి జిల్లా కలెక్టర్‌కు జిల్లా పర్యాటక శాఖ అధికారి నాగభూషణం వివరించారు. జిల్లాలో ఉన్న వీరభద్రస్వామి, రెడ్డమ్మ తల్లి వంటి ఎన్నో దేవాలయాలు ఉండటం వల్ల టెంపుల్ టూరిజంగా కూడా మంచి అవకాశాలు ఉన్నాయని తెలిపారు. గుర్రంకొండ పోర్ట్ వంటి చారిత్రక కట్టడాలు మన జిల్లాలో ఉండటం వల్ల హెరిటేజ్ టూరిజంకు అవకాశాలు ఉన్నాయన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అన్నమయ్య జిల్లాను అడ్వెంచర్ టూరిజం హబ్‌గా అభివృద్ధి చేసే చర్యలకు అనుగుణంగా పూర్తి స్థాయి ప్రాజెక్టు నివేదికను సమర్పించాలని ఆదేశించారు. జిల్లాలో వివిధ ప్రాంతాలను కలుపుతూ పర్యాటక సర్క్యూట్‌ను అభివృద్ధి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో ఫుడ్ ఫెస్టివల్ లాంటి కార్యక్రమాలు నిర్వహించి ఎక్కువ మంది పర్యాటకులు వచ్చేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లా సంయుక్త కలెక్టర్ ఆదర్శరాజేంద్రన్, మదనపల్లి సబ్ కలెక్టర్ మేఘస్వరూప్, పర్యాటక శాఖ రీజినల్ డైరెక్టర్ రమణప్రసాద్, జిల్లా పర్యాటక కౌన్సిల్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

హెల్ప్‌లైన్ నంబర్ల పోస్టర్లు ఏర్పాటు

రాయచోటి (జగదాంబసెంటర్): ప్రతి అంగన్వాడీ కేంద్రంలో టోల్‌ఫ్రీ హెల్ప్‌లైన్ నంబర్లకు సంబంధించిన పోస్టర్లు ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ పేర్కొన్నారు. మంగళవారం రాయచోటి కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో టోల్‌ఫ్రీ హెల్ప్‌లైన్ నంబర్ల పోస్టర్లు ఆవిష్కరించారు. ఎమర్జెన్సీ టోల్‌ఫ్రీ నంబర్లు ప్రజలకు అందుబాటులో ఉండాలనే ఉద్దేశంతో ఈ విధంగా ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో మదనపల్లి సబ్ కలెక్టర్ మేఘస్వరూప్, జిల్లా అటవీ శాఖ అధికారి, ఐసీడీఎస్ పీడీ రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

1న జాబ్‌మేళా

రాయచోటి(జగదాంబ సెంటర్): రాయచోటి పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో నవంబర్ 1న జిల్లా స్థాయి జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ నాగార్జున, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ పి.శివశంకర్ తెలిపారు. ఐసీఐసీఐ బ్యాంకు, ముత్తూట్ ఫైనాన్స్, టీవీఎస్ ఇండియా లిమిటెడ్, యంగ్ ఇండియా కంపెనీలు పాల్గొంటాయని పేర్కొన్నారు. పది, ఇంటర్, డిప్లొమో, ఏదైనా డిగ్రీ పాసైన వారు అర్హులన్నారు. ఉద్యోగాలకు ఎంపికైన వారికి రూ.18 వేల నుంచి రూ.30 వేల వరకు జీతం ఉంటుందన్నారు. ఆసక్తి గల నిరుద్యోగులు విద్యార్హతల ధ్రువీకరణ పత్రాలతో హాజరుకావాలని వారు కోరారు.

పోస్టుల వివరాలు

కంపెనీ పేరు	ఉద్యోగం పేరు	ఖాళీలు
ఐసీఐసీఐ	జూనియర్ ఆఫీసర్	50
ముతూట్ ఫైనాన్స్	జూనియర్ రిలేషన్‌షిప్ ఎగ్జిక్యూటివ్	10
టీవీఎస్ ఇండియన్ లిమిటెడ్	లిథియమ్ బ్యాటరీస్ అసెంబ్లింగ్	50
యంగ్ ఇండియా	మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్	30

క్లుప్తంగా

రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్ పోటీల్లో ప్రతిభ



విద్యార్థులను సత్కరిస్తున్న హెడ్మాస్టర్

గుర్రంకొండ : రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్ పోటీల్లో గుర్రంకొండ తెలుగు జెడ్పీహైస్కూల్ విద్యార్థులు ప్రతిభ చూపారు. నంద్యాల ఇండోర్ స్టేడియంలో రెండు రోజులుగా రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్ పోటీలు జరిగాయి. అండర్–17 ఫెన్సింగ్ పోటీల్లో ఉమ్మడి చిత్తూరు జిల్లా జట్టులో పాల్గొన్న కె.ప్రసన్నకుమార్ కాంస్య పతకం సాధించారు. అండర్–14 పోటీల్లో హరినాథ్, ముజాహిద్ కాంస్య పతకాలు సాధించారు. మంగళవారం జరిగిన అభినందన సభలో హెడ్మాస్టర్ అహ్మద్‌బాషా, పీడీ చింతిర్ల రమేష్, తదితరులు విద్యార్థులను ఘనంగా సన్మానించారు. రవీంద్ర, హర్షవర్ధన్‌రెడ్డి, త్రినాథ్, రెడ్డిమోహన్, మదన్‌మోహన్, ఉషారాణి, ప్రశాంతి, తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిపై రాయితో దాడి



గాయపడిన శ్రీనివాసులురెడ్డి

మదనపల్లె : వ్యక్తిపై రాయితో దాడి చేసిన సంఘటన కురబలకోట మండలంలో జరిగింది. కుటుంబ సభ్యుల వివరాల మేరకు...నందిరెడ్డిగారిపల్లె పంచాయతీ బండపల్లెకు చెందిన శ్రీనివాసులురెడ్డి (54) ఇంటి సమీపంలో ఇటీవల ప్రభుత్వం మంజూరు చేసిన సిమెంట్ రోడ్డు పనులు ప్రారంభించారు. రోడ్డు వేసేందుకు దారి స్థలాన్ని చదును చేస్తుండగా శ్రీనివాసులురెడ్డి అక్కడే ఉన్నాడు. చదువు చేసిన మట్టి పక్కనున్న సిద్దల చిన్నపరెడ్డి స్థలంలో పడటంతో, అప్పటికే రోడ్డు నిర్మాణంపై వ్యతిరేకతతో ఉన్న చిన్నపరెడ్డి ఆవేశానికి లోనై రాయితో శ్రీనివాసులురెడ్డిపై దాడికి పాల్పడ్డాడు. దాడిలో శ్రీనివాసులురెడ్డి తలకు తీవ్రంగా గాయం కాగా గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. ముదివేడు పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

స్నేహితుడిని కలవడానికి వచ్చి మృత్యు ఒడిలోకి...!!



మృతి చెందిన అనంతపురం యువకుడు హరి

కురబలకోట : మూర్ఛ వ్యాధి ఓ యువకుడి నిండు ప్రాణాన్ని తీసింది. అనంతపురం పట్టణానికి చెందిన హరి (21)మంగళవారం అంగళ్లులో ఆకస్మికంగా మృతి చెందినట్లు ముదివేడు పోలీసులు తెలిపారు. అంగళ్లులో ఓ ఇంజినీరింగ్ కళాశాలలో చదువుతున్న స్నేహితుడిని కలవడానికి మంగళవారం వచ్చాడు. అనంతరం అతను అంగళ్లులో బస్టాపు వద్ద నిలబడి ఉండగా మూర్ఛ (ఫిట్స్) వచ్చింది. ఒక్కసారిగా కుప్పకూలాడు. హుటా హుటిన అతన్ని మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే చనిపోయినట్లు వైద్యులు వెల్లడించారు. కుటుంబీకులు శోకతప్తులయ్యారు.

విద్యార్థులు చదువులో రాణించాలి

రాయచోటి : పోలీసుల పిల్లలు, విద్యార్థులు చదువులో రాణించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు అభిప్రాయపడ్డారు. పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల సందర్భంగా వివిధ విభాగాల్లో నిర్వహించిన పోటీల్లో విజేతలకు ఎస్పీ ప్రశంసాపత్రాలు, నగదు బహుమతి అందజేశారు. రాయచోటిలోని పలు కళాశాలలు, పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

హరిత దీపావళి.. ఆనందాల కేళి

పండగలన్నీ ప్రస్తుతం ట్రెండీగా మారిపోయాయి. దీపావళి పండగ అంటేనే పర్యావరణానికి హాని చేసేదిగా మారిపోయింది. పెద్ద శబ్దాలతో క్రాకర్స్ కాల్చడం.. ఘాటైన రసాయన పదార్థాలతో తయారు చేసిన టపాసులను కాల్చడంతో పర్యావరణానికి తీరని నష్టం కలగడమేగాక, శబ్ద కాలుష్యం, వాయు కాలుష్యం పెరిగిపోతోంది. అందుకే ప్రతి ఒక్కరూ ప్రకృతి హితంగా దీపావళి జరుపుకొందాం.. మన పర్యావరణాన్ని కాపాడుకుందాం.



- టపాసుల బదులు మొక్కను నాటుదామంటున్న విద్యావంతులు
- పాఠశాలల్లో అవగాహన కల్పించాలని కోరుతున్న తల్లిదండ్రులు

రాజంపేట టౌన్ : దీపావళి వెలుగుల పండుగ. చెడుపై మంచి సాధించిన విజయానికి నిదర్శనం. చీకటిని పారద్రోలి, జ్ఞానాన్ని పంచి జీవితంపై ఆశలు కల్పించే కాంతుల సందడి. అయితే అనేక మంది దీపావళిన పండగను కాలుష్య కారకంగా మార్చేస్తున్నారు. చెవులు బద్ధలయ్యే శబ్దాలు, ఊపిరితిత్తులు భరించలేని పొగలను విడుదల చేసే బాణ సంచాలను కాల్చడంతో తమ ఇబ్బందులను తామే కొని తెచ్చుకుంటున్నారు. దీపావళి రోజున టపాసులకు దూరంగా ఉండి కొన్నింటిని పాటిస్తే పర్యావరణ హితంగా జరుపుకోవచ్చని పలువురు చెబుతున్నారు.

బాణ సంచాలతో ఆరోగ్యానికి హానికరం

రకరకాల రసాయనాల మిశ్రమాలతో తయారుచేస్తున్న బాణ సంచాలు అనేక అనర్థాలకు దారి తీస్తున్నాయి. కాపర్, కాడ్మియం, లెడ్, అమ్మోనియం, నైట్రోజన్ ఆక్సైడ్, సల్ఫర్ డయాక్సైడ్, సోడియం మిశ్రమాలు, మెర్క్యురీ, లిథియం, పొటాషియం లోహ మిశ్రమాలను బాణ సంచాల తయారీలో వినియోగిస్తారు. వీటిని కాల్చడంతో ఊపిరితిత్తులు, చర్మం, కళ్లకు అనారోగ్య సమస్యలు వచ్చే ప్రమాదముంది. అలాగే క్యాన్సర్, గుండె జబ్బులు, ఆందోళన, ఒత్తిడి వంటి మానసిక సమస్యలు కలుగుతాయని వైద్యులు చెబుతున్నారు. శబ్దాలు, ఘాటు వాసనలతో చిన్నారులు, వృద్ధులు తీవ్ర అస్వస్థతకు గురయ్యే అవకాశాలున్నాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

ఇలా జరుపుకొందాం

దీపావళి రోజున తల్లిదండ్రులు తమ పిల్లలకు టపాసులకు బదులు ఒక మొక్కను బహుమతిగా ఇవ్వాలి. టపాసులు కాల్చితే కలిగే నష్టాలను వివరించి అవకాశం ఉన్న చోట ఒక మొక్క నాటించి దానిని పెంచి పెద్దచేసేలా తల్లిదండ్రులు పిల్లలను సమాయత్తం చేయాలి. దీపావళికి రెండు, మూడు రోజుల ముందు నుంచి పాఠశాలల్లో ఉపాధ్యాయులు విద్యార్థులను బృందాలుగా ఏర్పాటు చేసి హరిత దీపావళిపై అవగాహన కల్పించి వారిలో చైతన్యం నింపాలి. అలాగే దీపావళికి ముందురోజు కొంత మంది విద్యార్థులను జట్టుగా చేసి వారిచే పాఠశాల ఆవరణలో మొక్క నాటించి వాటిని సంరక్షించే బాధ్యతను ఆ విద్యార్థులకే అప్పజెప్పాలి. ప్రతి ఏడాది దీనిని ఓ సంప్రదాయంగా చేపట్టేలా విద్యార్థుల్లో స్ఫూర్తిని నింపాలి. ఎట్టి పరిస్థితుల్లో టపాసులు కాల్చకూడదని, దీపాలు వెలిగించి, మొక్కలు నాటి దీపావళి జరుపుకొనేలా విద్యార్థుల్లో మార్పు తీసుకొచ్చేందుకు కృషి చేసినప్పుడే హరిత దీపావళి సాధ్యం కాగలదని విద్యావంతులు చెబుతున్నారు.



మదనపల్లె మిషన్ కాంపౌండ్‌లో వెలసిన టపాకాయల దుకాణాలు

పండగ వేళ జరభద్రం..!

మదనపల్లె సిటీ : కుటుంబమంతా సందడిగా జరుపుకొనే పండగ వేళ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని మదనపల్లె ఫైర్ ఆఫీసర్ శివప్ప కోరారు. అగ్నిప్రమాదాలు జరిగిన వెంటనే 101 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేయాలని కోరారు. ప్రమాదాలు జరిగిన వెంటనే సమీప ఫైర్ స్టేషన్లకు సంబంధించిన కింది నెంబర్లకు ఫోన్ చేయవచ్చునన్నారు.

అగ్నిమాపక కేంద్రాల నంబర్లు	
మదనపల్లె	08571-222101
ములకలచెరువు	08582-252555
పీలేరు	08584-244399
వాల్మీకిపురం	08586-271199
రాయచోటి	08561-251099
రాజంపేట	08565-240299
రైల్వేకోడూరు	08563-244099
లక్కిరెడ్డిపల్లె	08567-234199

మా వాటా మాకివ్వాల్సిందే!

గాలివీడు: తమ వాటా ఇవ్వాల్సిందేనని అధికారులు ఒత్తిడిచేయడంతో టపాసుల దుకాణదారులు తలలు పట్టుకొంటున్నారు. ఇతర రాష్ట్రాల నుంచి రెండు రకాల పన్నులు చెల్లించి దుకాణదారులు బాణ సంచా తీసుకువస్తున్నారు. దీనికి రెవెన్యూ, పోలీస్, అగ్నిమాపక, పంచాయతీ శాఖ అధికారులు అనుమతులు తీసుకోవాలి. ఇందుకు లైసెన్స్ రుసుము చెల్లించాల్సి ఉంటుంది. ఇంత వరకు బాగానే ఉన్నా.. వివిధ శాఖల అధికారులు ప్రతి దుకాణం నుంచి రూ.5 వేలు ఇవ్వాలని పట్టుపడుతున్నట్లు వ్యాపారులు చెబుతున్నారు. ఇతర శాఖలతో మాకు సంభంధం లేదు.. మా సార్ చెప్పారు టపాసుల ప్యాకేజీ ఇవ్వాల్సిందేనంటూ చెప్పి దొరికినన్ని పట్టుకెళ్లడం పరిపాటిగా మారిపోయిందని వారు ఆవేదన చెందుతున్నారు. జిల్లా స్థాయి అధికారులు చొరవచూపి బలవంతపు వసూళ్లను కట్టడి చేసేలా చర్యలు తీసుకోవాలని దుకాణదారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

అవగాహన కల్పించాలని నిర్ణయించాం



దీపావళి రోజున టపాసులు కాల్చవద్దని చెబుతున్నాం. వాటితో కలిగే అనర్థాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నాం. తమ ప్రయత్నం కొంతయినా ఫలించాలని కృషి చేస్తున్నాం. చిన్న తరగతుల విద్యార్థుల్లో మార్పు తీసుకొస్తే హరిత దీపావళి సాధ్యమవుతుంది.

– పి.నాగమణి, హెచ్‌ఎం, ప్రభుత్వ హైస్కూల్, రాజంపేట

అవగాహన కల్పించాలి



టపాసులు కాల్చడంతో కలిగే అనర్థాలు, ఆరోగ్య సమస్యలపై విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం ఏర్పాటుచేసి అవగాహన కల్పించాలి. అప్పుడు టపాసులు కొనించమని చిన్నారులు మారాం చేయరు. విద్యాధికారులు ఈ దిశగా ఆలోచించి నిర్ణయం తీసుకుంటే హరిత దీపావళి చూడవచ్చు.

– మునగాల కృష్ణకుమార్, రిటైర్డ్ డిప్యూటీ డీఈఓ, రాజంపేట

దుష్పరిణామాలు తెలియజేస్తాం



టపాసులతో కలిగే దుష్పరిమాణాలపై ప్రతి విద్యార్థికీ అర్థమయ్యేలా అవగాహన కల్పిచాలని పీఈటీలకు ఆదేశాలిస్తున్నాం. దీపావళికి ముందు రోజు పాఠశాల ఆవరణలో విద్యార్థులచే మొక్కలు నాటించే ప్రణాళిక రూపొందించుకోవాలని తెలియచేస్తా. మంచి మార్పుకు ఇది నాంది.

– జి.భానుమూర్తిరాజు, వ్యాయామ విద్యా తనిఖీ అధికారి

దీపావళి సమాజ హితం కావాలి



దీపావళి అందరికీ ఆనందం కలిగించాలి. కాలుష్యాన్ని, తద్వారా అనారోగ్యాన్ని కలిగించే విధంగా ఉండరాదు. వాతావరణ కాలుష్యంతో అనేక సమస్యలు తలెత్తుతున్నాయి. ఈ సమస్యలన్నింటికీ పరిష్కారం పచ్చదనమే. అందువల్ల ప్రతి ఒక్కరూ హరిత దీపావళి జరుపుకోవాలి.

– జి.చక్రధర్‌రాజు, మాజీ కో–ఆర్డినేటర్, నేషనల్ గ్రీన్‌కోర్

మత్తుకు బానిసలు కావద్దు

జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు



గంజాయి విక్రేరత మహబూబ్ బాషాను చూపుతున్న ఎస్పీ విద్యాసాగర్ నాయుడు

రాయచోటి : ఉన్నత భవిష్యత్తు కల్గిన యువత గంజాయి, ఇతర మాదక ద్రవ్యాలకు బానిసలు కావద్దని జిల్లా ఎస్పీ వి.విద్యాసాగర్ నాయుడు సూచించారు. జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో 20 కిలోల గంజాయితో పట్టుబడిన నిందితుడితో ఎస్పీ మంగళవారం వీడియో సమావేశం నిర్వహించారు. పీలేరులో ఐదు రోజుల క్రిందట ఇంటర్ చదివే ఇద్దరు యువకులు గంజాయి మత్తులో ఉండి రైలు క్రిందపడి ప్రాణాలు కోల్పోయారన్నారు. ఈ సంఘటనను దృష్టిలో ఉంచుకొని గంజాయి విక్రయదారులపై ప్రత్యేక పోలీసు బృందంతో దాడులు నిర్వహించామన్నారు. చనిపోయిన యువకులు వాడిన గంజాయి ఎక్కడెక్కడ లభించిందనే విషయంపై ఆరా తీశామన్నారు. కొందరు గ్యాంగ్‌గా ఏర్పడి స్థానికంగా గంజాయి అమ్ముతున్న వివరాల ఆధారంగా షేక్ మహబూబ్ బాషా(45)ను అదుపులోకి తీసుకొని సోదాలు నిర్వహించగా 20 కిలోల గంజాయి దొరికిందన్నారు. మహబూబ్ బాషా 20 మందికి పైగా పీలేరు టౌన్‌లో యువతకు గంజాయి అమ్ముతున్నట్లు విచారణలో తేలిందన్నారు. ఇద్దరు విద్యార్థులు గంజాయిని పీల్చి చనిపోవడానికి అతడు కారణమయ్యారన్నారు. పీలేరు పోలీసులు కేసు నమోదు చేసి కోర్టుకు హాజరుపరుస్తున్నట్లు ఎస్పీ వివరించారు. త్వరలో మిగిలిన వారిని అరెస్టు చేస్తామని జిల్లా ఎస్పీ తెలిపారు. గంజాయి విక్రయదారులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు. ఈ సమావేశంలో రాయచోటి డీఎస్పీ కృష్ణమోహన్, పీలేరు సిఐ యుగంధర్‌లు పాల్గొన్నారు.

బైక్‌లు ఢీకొని ఇద్దరికి గాయాలు

సంబేపల్లె : మండలంలోని రెడ్డివారిపల్లెకు చెందిన బాలాజీ ద్విచక్ర వాహనంలో దేవపట్ల నుంచి స్వగ్రామానికి వెళ్తున్నారు. వడ్డిపల్లె క్రాస్ సమీపంలోకి రాగానే రాయచోటి నుంచి ద్విచక్ర వాహనంలో జావెద్ వస్తున్నారు. ఇరువురూ చిత్తూరు–కర్నూలు జాతీయ రహదారిపై రెడ్డివారిపల్లె సమీపంలో పరస్పరం ఢీకొన్నారు. ప్రమాదంలో ఇరువురికీ గాయాలవడంతో 108 సాయంతో రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ట్యాంకు పైకెక్కి వ్యక్తి హల్‌చల్

వల సాయంతో కిందకు దించిన రెస్క్యూ బృందం



ట్యాంకుపై అంచున నిలుచున్న శ్రీనివాసులు



శ్రీనివాసులును వలలో కూర్చోబెడుతున్న పోలీసులు

బి.కొత్తకోట : మండలంలోని బి. కొత్తకోటలో ఓ వ్యక్తి కుటుంబ కలహాలతో పూటుగా మద్యం తాగి రక్షిత నీటి ట్యాంకుపైకి ఎక్కి ఆత్మహత్య చేసుకుంటానంటూ హల్‌చల్ చేశారు. మూడు గంటల తర్వాత అతడిని సురక్షితంగా కిందకు తీసుకురావడంతో కుటుంబీకులు ఊపిరి పీల్చుకున్నారు. సీఐ కె.రాజారెడ్డి కథనం మేరకు.. బి.కొత్తకోట దళిత వాడకు చెందిన కే.శ్రీనివాసులు(32)కు భార్య శిరీష, ముగ్గురు పిల్లలు ఉన్నారు. నగర పంచాయతీలో పారిశుద్ధ్య కార్మికుడిగా పనిచేశాడు. తర్వాత అనారోగ్య సమస్య తలెత్తడంతో శస్త్ర చికిత్స చేశారు. పనులు చేసుకోలేని పరిస్థితుల్లో కుటుంబ కలహాలు పెరిగాయి. ఈ నేపథ్యంలో మధ్యాహ్నం మూడు గంటల సమయంలో శ్రీనివాసులు మద్యం తాగిన మత్తులో ఆత్మహత్య చేసుకోవాలని జ్యోతి చౌక్‌లోని వంద అడుగుల ఎత్తున ఉన్న రక్షిత నీటి ట్యాంకుపైకి ఎక్కాడు. అంచున కూర్చుని అరవడంతో స్థానికులు చూసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. సీఐ రాజారెడ్డి, పోలీసులు అప్రమత్తమై ట్యాంకు వద్దకు చేరుకుని అతడిని వారించారు. కానిస్టేబుల్ జబీవుల్లా పైకి వెళ్లి నచ్చజెప్పి అక్కడే ఉండిపోయారు. మత్తులో ఉండడంతో కిందకు తెస్తే ప్రమాదం జరిగే పరిస్థితి ఉందని సీఐ రాజారెడ్డి గుర్తించి మదనపల్లె రెస్క్యూ టీంకు సమాచారం ఇచ్చారు. సిబ్బంది ఎస్.అబ్దుల్ హమీద్, పురుషోత్తం, ఇమ్రాన్, రాజేంద్ర చేరుకుని తాళ్లు, వలను పైకి పంపి శ్రీనివాసులును కిందకు తీసుకువచ్చారు. వందలసంఖ్యలో ప్రజలు దీన్ని ఆసక్తితో తిలకించారు. కథ సుఖాతం కావడంతో అతడి కుటుంబీకులు ఊపిరి పీల్చుకున్నారు. శ్రీనివాసులును పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లి కౌన్సిలింగ్ ఇచ్చారు. ఇలా వ్యవహరించదారని నచ్చజెప్పారు. భార్య శిరీషకు శ్రీనివాసులును అప్పగించారు.

అదృష్టవంతుడు

ట్యాంకు పైకి మద్యం మత్తులో ఎక్కిన శ్రీనివాసులుకు ఇనుప నిచ్చెన ప్రమాదకరంగా ఉందన్న విషయం గమనించలేదు. పైకి వెళ్లేందుకు భద్రత కోసం నిచ్చెనకు రెండు వైపులా రాడ్ లాంటి కమ్మీని ఏర్పాటు చేశారు. ఇది కుడి వైపున పూర్తి తొలగిపోయి ఉంది. విడిపోయిన కమ్మి వ్రేలాడుతోంది. ఈ కమ్మి లేనిచోట చిన్న పొరబాటు జరిగి ఉన్నా పైనుంచి కిందకు పడిపోయి ప్రాణాపాయం కలిగేది. అదృష్టవశాత్తూ ప్రమాదం జరగలేదు. పైన ఉన్నప్పుడు కానిస్టేబుల్ జబీవుల్లా శ్రీనివాసులు వద్దే ఉండటంతో ఎలాంటి ప్రయత్నం చేసే అవకాశం లేకుండా చేశారు.



సురక్షితంగా కిందకు చేరిన శ్రీనివాసులు

సనాతన ధర్మం పేరుతో విద్వేషాలు రెచ్చగొడుతున్నారు



మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఈశ్వరయ్య

రాయచోటి అర్బన్ : సనాతన ధర్మం పేరుతో మత విద్వేషాలను రెచ్చగొడుతూ కొన్ని పార్టీలు వివాదాలకు తెరతీస్తున్నాయని పలు సంఘాల నేతలు, వక్తలు ఆవేదన వ్యక్తం చేశారు. రాయచోటి పట్టణంలోని దళిత హక్కుల పోరాట సమితి(డీహెచ్‌పీఎస్) కార్యాలయంలో సమాజానికి ఏది అవసరం? సనాతన ధర్మమా? లౌకికవాద రాజ్యాంగమా? అంశంపై మంగళవారం చర్చాగోష్టి జరిగింది. డీహెచ్‌పీఎస్ జిల్లా కార్యదర్శి మండెం సుధీర్ కుమార్ మాట్లాడుతూ ధర్మ పరిరక్షణ పేరిట వివాదాలను రేకెత్తించి, రాజకీయలబ్ధి పొందాలనుకునే నాయకులకు తగు రీతిలో బుద్ధిచెప్పాలని పిలుపునిచ్చారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు గుజ్జల ఈశ్వరయ్య మాట్లాడుతూ రాజ్యాంగంలో సనాతన ధర్మం ప్రస్తావన లేదని, లౌకిక వాదంతో సమానత్వాన్ని మాత్రమే రాజ్యాంగ నిర్మాతలు ఉద్బోధించారని పేర్కొన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు మాట్లాడుతూ సనాతన ధర్మానికి వక్రభాష్యం చెబుతూ హిందూ మతాన్ని కొన్ని పార్టీల నాయకులు అప్రతిష్ఠ పాలు చేస్తున్నారని, అధికారాన్ని అనుభవించడానికి హిందూ ధర్మాన్ని వాడుకోవడం ఆక్షేపనీయం అన్నారు. ప్రజల్లో కుల, మత విభజనకు చేస్తున్న కుట్రలను ఐక్యంగా ప్రతిఘటించాలంటూ పిలుపునిచ్చారు. సీపీఐ జిల్లా కార్యదర్శి నరసింహులు రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మత విద్వేషాలను రెచ్చగొట్టేలా ఉపన్యసించడం దురదృష్టకరం అన్నారు. మణిపూర్ ఘర్షణల్లో మహిళను నగ్నంగా ఊరేగించిన రోజున పవన్‌కళ్యాణ్ ఎందుకు మాట్లాడలేదంటూ ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు హరికుమార్, భారతీయ అంబేడ్కర్ సేన రాష్ట్ర కార్యదర్శి పల్లం తాతయ్య, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి మహేష్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి రామాంజులు, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి సాంబశివ, వ్యకాస రాష్ట్ర ఉపాధ్యక్షుడు తోపు క్రిష్ణప్ప, గిరిజన సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి విశ్వనాథనాయక్, పౌర హక్కుల సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఎం.రవి శంకర్, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి జక్కల వెంకటేష్, కదిరయ్య, రామాంజనేయులు, రంగారెడ్డి, సుమిత్రమ్మ, కోటి, తదితరులు పాల్గొన్నారు.

ఇరు వర్గాల మధ్య భూ వివాదం



పట్టా భూమిలో ఏర్పాటు చేసిన రేకుల షెడ్డు

గాలివీడు : భూ వివాదంలో ఇరువర్గాల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొన్న సంఘటన మంగళవారం గాలివీడులో చోటుచేసుకుంది. మండల కేంద్రంలోని గేట్ నాలుగు రోడ్ల కూడలి వద్ద ఇటీవల రహదారి విస్తరణకు అక్రమ నిర్మాణాలు తొలగించారు. అనంతరం సర్వే నెంబర్–2266లో 1.50 ఎకరాల భూమిని ప్రభుత్వం ఆర్‌అండ్‌బీకి అప్పగించింది. ప్రస్తుతం నాలుగు రోడ్ల కూడలి విస్తరణ పనులు జరుగుతుండగా, స్థానికులు కొందరు ఆర్‌అండ్‌బీ స్థలం ఆక్రమించి రేకుల షెడ్లు ఏర్పాటుచేశారు. ఆ రేకుల షెడ్ల వెనుక భాగం తమ అనుభవంలో ఉందని కొందరు ముస్లింలు కొంత స్థలం చుట్టూ రేకులువేశారు. ఇదిలా ఉంటే అది తమ పట్టా భూమి అంటూ ఇంకో వర్గం వారు రేకులను తొలగించారు. అన్ని వర్గాల వారు మంగళవారం ఒక చోట చేరి వివాదానికి దిగడంతో ఉద్రిక్తత నెలకొంది. అధికార పార్టీ నాయకుల అండతో తమ పట్టా భూమిలో షెడ్లు వేశారని భూ యజమాని, స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తహసీల్దారు భాగ్యలత వివరణ కోరగా ఆర్‌అండ్‌బీ అధికారులతో కలిసి సర్వే నిర్వహించి ఆక్రమణలు తొలగిస్తామని, హద్దులు కేటాయిస్తామని పేర్కొన్నారు.

ఆర్‌అండ్‌బీ డీఈ వెంకటసుబ్బయ్య వివరణ ఇస్తూ ఆక్రమణలో ఉన్న రేకుల షెడ్లను స్వచ్ఛందంగా తొలగించాలని తెలిపారు. నాలుగురోడ్ల కూడలిలోని సర్వే నెంబర్ 2266లో ఆర్‌అండ్‌బీ స్థలంలో సర్వే చేశామని పేర్కొన్నారు. ఎక్కడెక్కడ స్థలం ఆక్రమణకు గురైందో గుర్తించి స్వాధీనం చేసుకుంటామని, ఆక్రమణదారులను ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు.

హోరాహోరీగా కబడ్డీ పోటీలు



విజేతగా నిలిచిన కడప జిల్లా బాలుర జట్టు



ప్రథమ స్థానంలో నిలిచిన చిత్తూరు బాలికల జట్టు

రాయచోటి టౌన్ : రాష్ట్ర స్థాయి అండర్–17 బాల, బాలికల కబడ్డీ పోటీలు మంగళవారం హోరా హోరీగా సాగాయి. రాయచోటి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బాలుర విభాగంలో నిర్వహించిన కబడ్డీ పోటీలలో అనంతపురం జట్టుపై కడప జట్టు 14 పాయింట్లు అధికంగా సాధించి విజేతగా నిలవగా అనంతపురం జట్టు ద్వితీయ స్థానం దక్కించుకుంది. కర్నూలు జిల్లా జట్టు తృతీయ, చిత్తూరు జట్టు నాలుగో స్థానాల్లో నిలిచాయి.

బాలికల విభాగంలో..

మంగళవారం జరిగిన కబడ్డీ ఫైనల్ మ్యాచ్‌లో శ్రీకాకుళం జట్టుపై మూడు పాయింట్ల ఆధిక్యంతో చిత్తూరు జట్టు విజయం సాధించింది. శ్రీకాకుళం జట్టు ద్వితీయ, అనంతపురం జట్టు తృతీయ, కృష్ణా జట్టు నాలుగో స్థానంలో నిలిచాయి.

ఆంజనేయస్వామి ఆలయంలో చోరీ



ఆంజనేయస్వామి ప్రభవను తొలగించిన దుండగులు



ఆలయంలోని సామగ్రిని ధ్వంసం చేశారిలా..

గుర్రంకొండ : గుర్రంకొండ సమీపంలోని శ్రీవోనీ ఆంజనేయస్వామి ఆలయంలో దుండగులు చొరబడి స్వామికి అలంకరించిన ప్రభవలను ధ్వంసం చేశారు. లక్ష రూపాయల విలువ చేసే వస్తువులను దోచుకెళ్లారు. వివరాలిలా ఉన్నాయి.. పట్టణానికి సమీపంలోని గుర్రంకొండ–సంగసముద్రం మార్గంలో పురాతన వోనీ ఆంజనేయ స్వామి ఉంది. సోమవారం రాత్రి గుర్తు తెలియని దుండగులు చొరబడి ఆలయం గేట్లు పగలగొట్టి లోపలికి ప్రవేశించారు. స్వామికి అలంకరించిన ప్రభవను రాడ్లతో ధ్వంసం చేశారు. గంట, హారతి, ఇతర పూజా సామగ్రి, వస్తువులు బయటికి తెచ్చి ధ్వంసం చేశారు. కార్యాలయ గది తాళాలు పగలగొట్టి.. అందులోని బీరువాలో ఉన్న రూ.20 వేల నగదు దోచుకెళ్లారు. ఇతర వస్తువులను ధ్వంసం చేశారు. పక్కనే వ్యవసాయం చేసుకొంటున్న రైతులు ఆలయంలో అలికిడి విని కేకలు వేయగా దుండుగులు ఆ వస్తువులు పడేసి పరారయ్యారు. గత పది రోజుల్లోనే రెండు ఆంజనేయస్వామి ఆలయాలను దుండుగులు ధ్వంసం చేయడంతో భక్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎస్ఐ మధురామచంద్రుడు, సిబ్బంది చేరుకుని చోరీ జరిగిన ప్రాంతం, ధ్వంసమైన వస్తువులు పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బాబాయిని కత్తితో పొడిచిన అబ్బాయి



రమేష్ (ఫైల్)

పీలేరు : పిల్లల ఆలనా పాలనా చూసుకోవాల్సిన బాబాయి.. మద్యం తాగి రోజూ వేధిస్తుండడంతో ఆయన అన్న కుమారుడు కత్తితో పొడిచి చంపిన సంఘటన సోమవారం రాత్రి అన్నమయ్య జిల్లా వాల్మీకిపురం మండలంలో చోటుచేసుకుంది. పట్టణం లోని ఎన్‌టీఆర్ కాలనీకి చెందిన రవి, రమేష్ అన్నదమ్ములు. రవి, అతడి భార్య షర్మిల బెంగళూరులో వాచ్‌మెన్‌లుగా పనిచేస్తున్నారు. రవి కుమారుడు (14) వాల్మీకిపురం పీవీసీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. బాబాయ్ రమేష్(35)తో కలిసి ఇంటి వద్ద నివసిస్తున్నాడు. రమేష్ కూలి పనులకు వెళ్తూ ఇటీవల మద్యానికి బానిసయ్యాడు. ఇంటికి వచ్చి మైనర్ బాలుడిని నిత్యం కొడుతూ వేధింపులకు గురిచేసేవాడు. సోమవారం రాత్రి మరోసారి గొడవకు దిగి వేధిస్తుండడంతో మైనర్ బాలుడు ఆగ్రహంతో ఇంట్లో కూరగాయలు తరిగే కత్తితో అతడిని పొడిచేశాడు. రమేష్ రక్తపు మడుగులో పడి ఉండటం స్థానికులు గమనించి 108కు సమాచారం అందించారు. 108 అక్కడికి చేరుకునే సమయానికి రమేష్ మృతి చెందాడు. వాల్మీకిపురం సీఐ ప్రసాద్ బాబు, ఎస్ఐ చంద్రశేఖర్ లు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. నిందితుడికోసం పోలీసులు గాలిస్తున్నట్లు తెలిపారు.